ప్రజాశక్తి
మంగళవారం 9 సెప్టెంబర్ 2025 5 విజయనగరం



సుజల స్రవంతి భూ సేకరణ వేగవంతం

కలెక్టర్ బిఆర్ అంబేద్కర్

ప్రజాశక్తి-కంటోన్మెంట్

ఉత్తరాంధ్ర సుజల స్రవంతి ప్రాజెక్టు భూ సేకరణను వేగవంతం చేయాలని కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ఆదేశించారు. ఈ ప్రాజెక్టు భూ సేకరణపై తమ ఛాంబర్లో సంబంధిత అధికారులతో సోమవారం సమావేశం నిర్వహించారు. ఎస్.కోట, వేపాడ, కొత్తవలస మండలాల పరిధిలోని నాలుగు గ్రామాల్లో 108 ఎకరాలు, బొండపల్లి మండలంలోని 3 గ్రామాల పరిధిలో 126 ఎకరాల భూసేకరణ పై చర్చించారు. ఈ గ్రామాల రైతులతో త్వరలో సమావేశం నిర్వహించి ధర ఖరారు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో భూసేకరణ విభాగం ప్రత్యేక ఉప కలెక్టర్ ఎం.ఎస్.కళావతి, సుజల స్రవంతి ఇఇ ఎ.ఉమేష్ కుమార్, ఆయా భూసేకరణ విభాగాల రెవెన్యూ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

మూతపడిన పరిశ్రమలను తెరిపించాలి

సిఐటియు జిల్లా మహాసభలో పలు తీర్మానాలు



మహాసభలో మాట్లాడుతున్న సిఐటియు రాష్ట్ర ప్రధానకార్యదర్శి నర్సింగరావు

ప్రజాశక్తి-రాజాం,రేగిడి

జిల్లాలో మూతపడిన పరిశ్రమలను ప్రభుత్వం తెరిపించాలని సిఐటియు జిల్లా మహాసభ డిమాండ్ చేసింది. వలసలను ఆపి కార్మికులకు ఉపాధి అవకాశాలు కల్పించాలని తీర్మానించింది. రాజాంలోని శ్రీసాయి నటరాజ్ కల్యాణ మండపంలో జరిగిన సిఐటియు 11వ జిల్లా మహాసభ రెండోరోజు సోమవారం ఉత్సాహ పూరితంగా సాగింది. సిఐటియు నాయకులు పి.శంకర్రావు, అంబళ్ల గౌరినాయుడు, ఎస్.అనసూయ అధ్యక్ష వర్గంగా జరిగిన ఈ మహాసభలో పలు తీర్మానాలు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసిన స్త్రీశక్తి పథకం (ఉచిత బస్సు) వల్ల ఆటో కార్మికులు జీవనోపాధి కోల్పోయారని, వెంటనే వారికి రూ.25వేలు చొప్పున ఆర్థిక సహాయం అందజేయాలని మహాసభ తీర్మానించింది. శ్రామిక మహిళల సమస్యలు పరిష్కరించాలని, పని ప్రదేశాల్లో లైంగిక వేధింపుల నిరోధక చట్టాన్ని పక్కాగా అమలు చేయాలని, రైతులకు అవసరమైన ఎరువులను అందించాలని డిమాండ్ సమావేశం డిమాండ్‌చేసింది. ప్రభుత్వరంగ సంస్థల ప్రైవేటీకరణ ఆపాలని, అసంఘటితరంగ కార్మికులకు సమగ్ర చట్టం చేయాలని, కేంద్రప్రభుత్వం తెచ్చిన నాలుగు లేబర్ కోడ్స్ రద్దు చేయాలని, మున్సిపల్ కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలని, కాంట్రాక్టు,ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని, రెగ్యులర్ చేసి రిటైర్మెంట్ బెనిఫిట్స్ కల్పించాలని తీర్మానాలు చేశారు. పంచాయతీ కార్మికులకు,గ్రీన్ అంబాసిడర్లకు బకాయి ఉన్న వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు.

అనంతరం ప్రతినిధులనుద్దేశించి సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్ నర్సింగరావు,రాష్ట్ర కార్యదర్శి కె.సుబ్బరావమ్మ మాట్లాడుతూ ప్రభుత్వ రంగసంస్థలను కాపాడుకునేందుకు ఉద్యమాల్లో ప్రజలను భాగస్వామ్యం చేయాలని పిలుపునిచ్చారు. కార్మిక వర్గానికి బిజెపి వ్యతిరేకం అని, బిజెపి తప్పుడు సిద్ధాంతాలతో ప్రజలను మభ్యపెడుతోందని అన్నారు. ప్రభుత్వాన్ని స్తంభింపచేందుకు విద్యుత్‌శాఖను కూడా భాగస్వామ్యం చేయాలన్నారు. ప్రభుత్వ విధానాలతో ప్రైవేట్ రంగంలో నడుస్తున్న పరిశ్రమలు సైతం మూతపడి కార్మికులు రోడ్డున పడుతున్నారని అన్నారు. భవిష్యత్తులో కార్మిక, కర్షక, కూలీల ఐక్య ఉద్యమాలకు మరింత ఉద్యుతం చేయాలని అన్నారు. మహాసభలో తమ్మినేని సూర్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు. పలు ప్రజాసంఘాల నాయకులు సౌహార్ద సందేశాలు ఇచ్చారు.

సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా సురేష్, టివి రమణ



సురేష్, టివి రమణ

సిఐటియు మహాసభలో 70 మందితో జిల్లా నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా కె.సురేష్, ప్రధాన కార్యదర్శిగా టివి రమణ, కోశాధికారిగా ఎ.జగన్మోహన్‌రావు, ఉపాధ్యక్షులుగా పి. శంకరరావు, టి.సూర్యనారాయణ, వి.లక్ష్మి, అనసూయ, గౌరినాయుడు, అప్పలసూరి, బి.సుధారాణి, కార్యదర్శులుగా రవికుమార్, బి.రమణ, వి.రాములు, ఎం.రమణ, కాంతారావు, ఎం.త్రినాధ్ ఎన్నికయ్యారు. మరో 53మంది సభ్యులతో జిల్లా కమిటీ ఏకగ్రీవంగా ఎన్నికైంది.

ఎవరు పోటీ చేద్దాం!

- గ్రామాల్లో స్థానిక ఎన్నికలపై చర్చోపచర్చలు
- ప్రారంభమైన పార్టీల శిబిరాలు



ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

గ్రామ పంచాయతీల్లో స్థానిక సంస్థల వేడి మొదలైంది. వివిధ పార్టీలు ఈమేరకు సమయత్తమవుతున్నాయి. గ్రామాల్లో కమిటీలు, సమావేశాలు ప్రారంభమయ్యాయి. ఈగ్రామంలో పోటీకొస్తావా... ఆగుతుంటావా? అన్నట్టుగా రచ్చ బండ కబుర్లు కూడా అక్కడక్కడా వినిపిస్తున్నాయి. 2026 మార్చిలో పంచాయతీ సర్పంచులు, ఎంపిటిసిల పదవీ కాలం పూర్తి కానున్న విషయం విదితమే. ఈనేపథ్యంలో మూడు నెలలు ముందుగా వచ్చే ఏడాది జనవరిలో ఎన్నికలకు సిద్ధం కావాలంటూ ఇటీవల రాష్ట్ర ఎన్నికల సంఘం ప్రభుత్వానికి లేఖరాసిన సంగతి తెలిసిందే. అక్టోబర్ 15లోగా డిలిమిటేషన్, రిజర్వేషన్ల ఖరారు ప్రక్రియ, నవంబరు 15లోపు వార్డులవారీ ఓటర్ల జాబితా, అదే నెల 15లోపు ఎన్నికల రిటర్నింగ్ అధికారుల నియామకం, ఆ నెలాఖరునాటికి పోలింగ్ స్టేషన్ల ఏర్పాటు, డిసెంబర్ 15నాటికి రిజర్వేషన్లు ఖరారు, డిసెంబర్లో రాజకీయ పార్టీలు, సీనియర్ నాయకులతో సమావేశాలు నిర్వహించేందుకు సిద్ధం కావాలని కూడా ఎన్నికల విభాగానికి దిశానిర్దేశం చేసింది. ఈనేపథ్యంలో టిడిపి, వైసిపి, జనసేన, కాంగ్రెస్ తదితర పార్టీలు ఎన్నికల వాతావరణంలోకి వెళ్లాయి. ముఖ్యంగా అధికార ప్రతిపక్షాల్లో ఈ వేడి ఎక్కువగా కనిపిస్తోంది. సర్పంచులు, వార్డు కౌన్సిలర్లు, డివిజన్ కార్పొరేటర్లుగా పోటీ చేయాలనే ఆశావహులు పార్టీ శాఖలను అప్రమత్తం చేస్తున్నారని తమవంతుగా తమవైపు తిప్పుకునే విధంగా వ్యవహరిస్తున్నారు. అధికారంలో ఉన్నాం కాబట్టి తమ మాట లేకుండా పంచాయతీ లేదా వార్డు, డివిజన్లలో ఇతరుల మాట చెల్లబోదన్నట్టుగా టిడిపి నాయకులు ఇతరుల్ని ప్రభావితం చేస్తుండగా, ప్రభుత్వ అసంతృప్తులను ఎన్నికల ఆయుధంగా మలుచుకునే పనిలో వైసిపి నిమగ్నమౌతోంది. ఇందులో భాగంగానే ఇరు పార్టీలకు చెందిన గ్రామ, వార్డు, డివిజన్ స్థాయి నాయకులు ఎన్నికల సంఘం ప్రకటన తరువాత తమ నాయకులను కలవడం మొదలు పెట్టారు. ఈనేపథ్యంలో వైసిపి జిల్లా అధ్యక్షులు మజ్జి శ్రీనివాసరావు పుట్టినరోజు ఇటీవల మునుపెన్నడూ లేనంతగా జరిగింది. దాదాపు ఎక్కువ మంది సర్పంచులు, ఆశావహులు ఆయన్ను కలిసి ఆశీస్సులు తీసుకున్నారు. టిడిపిలో కూడా ఆదేరకమైన కదలికలు కనిపిస్తున్నాయి. ఈ క్రమంలో ఎన్నికల్లో కలిసొచ్చేవారికి గ్రామ స్థాయిలో చిన్నచితక రాజకీయ, ఆర్థిక అవకాశాలు కల్పిస్తామంటూ చెప్పుకోవడం కూడా మొదలైంది. ప్రధానంగా అధికార ప్రతిపక్షాలకు చెందిన యువత, రాజకీయ ఆసక్తిగలవారు తరుచూ కలుసుకోవడం, ఎవరు పోటీ చేస్తే గెలిచే అవకాశముందో చర్చించుకోవడం కనిపిస్తోంది. మరోవైపు అధికార టిడిపి నుంచి గ్రామాల్లో సర్పంచ్‌లుగా పోటీ చేసేందుకు పలువురు ఉత్సాహం చూపుతున్నారు.

రైతులకు సరిపడా యూరియా నిల్వలు

మంత్రి కొండపల్లి శ్రీనివాస్

ప్రజాశక్తి-విజయనగరం ప్రతినిధి

ప్రస్తుత పంటల సాగు విస్తీర్ణానికి అనుగుణంగా జిల్లాలో తగినంతగా యూరియా నిల్వలు అందుబాటులో ఉన్నాయని, రైతులు ఆందోళన చెందాలిన అవసరం లేదని రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. రైతులకు అవసరమైన మేరకు యూరియాను అందించేందుకు తగిన చర్యలు తీసుకున్నామని పేర్కొన్నారు. ఈ సీజన్‌లో ఇప్పటి వరకు 26,989 మెట్రిక్ టన్నుల యూరియాను రైతులకు అందించినట్లు తెలిపారు. ప్రస్తుతం జిల్లాలో 657 మెట్రిక్ టన్నుల యూరియా ఎస్ఎస్‌కెల్లో, ప్రయివేటు వర్తకుల వద్ద సిద్ధంగా ఉందని తెలిపారు. మంగళ, బుధవారాలలో రెండు వేల టన్నులు యూరియా జిల్లాకు రానుందని, ఇది కాకుండా ఈ నెలాఖరుకు మరో మూడు వేల మెట్రిక్ టన్నుల యూరియా వస్తుందని తెలిపారు. ఇది జిల్లా అవసరాలకు సరిపోతుందని, అందువల్ల రైతులు షాపులవద్ద గంటల తరబడి క్యూల్లో నిల్చోవాల్సిన అవసరం లేదని మంత్రి సూచించారు. అందరికీ సజావుగా యూరియాను అందించేందుకు తగిన చర్యలను తీసుకున్నామని, ఆందోళన చెందవద్దని ఆయన విజ్ఞప్తి చేశారు. జిల్లా ఉన్నతాధికారులంతా క్షేత్రస్థాయిలో పర్యటించి అక్రమ నిల్వలపై ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలని, యూరియా పంపిణీని పర్యవేక్షించాలని కోరారు. కొనుగోలు విషయంలో రైతుల ఎదుర్కొంటున్న సమస్యలను ఎప్పటి కప్పుడు తెలుసుకుని అందుకు అనుగుణంగా తక్షణ చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించినట్లు మంత్రి శ్రీనివాస్ తెలిపారు.

యూరియా లోటు లేదు

అమ్మవారి పండగ ఏర్పాట్లను గడువులోగా పూర్తి చేయాలి : కలెక్టర్ బి.ఆర్.అంబేద్కర్

ప్రజాశక్తి-విజయనగరంకోట

జిల్లాలో యూరియా లోటు లేదనే విషయాన్ని రైతులకు అర్థం అయ్యేలా తెలియజేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ తెలిపారు. రెండో విడత కోసం ఇండెంట్ పెట్టడం జరిగిందని, వచ్చిన వెంటనే అందజేస్తారని తెలిపారు. పిజిఆర్ఎస్ అనంతరం కలెక్టర్ అధికారులతో మాట్లాడుతూ ఆదివారం మండల ప్రత్యేకాధికారులంతా ఆర్ఎస్‌కెలను తనిఖీ చేసి నివేదికలు అందజేశారని తెలిపారు. మొదటి విడత పంపిణీ ఇంచుమించుగా పూర్తి చేసామని, రెండో విడత కూడా 30 శాతం పై బడి పూర్తి చేసామని, మిగిలినవి వారం లోగా పంపిణీ చేస్తామని స్పష్టం చేశారు. ప్రతి రైతు రెండో విడత యూరియ సరఫరా పైనే ఆందోళన చెందుతున్నారని, సరఫరాకు సమయం ఇంకా ఉందని అన్నారు. రెండో విడత ఎంత వస్తుంది, ఎక్కడ ఎప్పుడు ఎంత సరఫరా చేస్తామో ఒక షెడ్యూల్ ను సిద్ధం చేయాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి విటి రామారావును ఆదేశించారు.



మాట్లాడుతున్న కలెక్టర్ అంబేద్కర్

మండల తహశీల్దార్, ఎంపిడిఒ, ప్రత్యేకాధికారులు వారి పనులు చూస్తూనే యూరియా సరఫరా పై కూడా పర్యవేక్షణ చేయాలని, రానున్న రెండవ విడత పంపిణీ సక్రమంగా జరిగే వరకూ పర్యవేక్షించాలని ఆదేశించారు.

పైడితల్లి అమ్మవారి పండగ ఏర్పాట్లపై సమీక్షిస్తూ ఎవరికీ కేటాయించిన విధులను వారు ఇచ్చిన గడువు లోపలే పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ప్రభుత్వం మంజూరు చేసిన 50 లక్షల విడుదల కోసం డిఒ లేఖ రాశామని, నిధులు వస్తే ఎలా ఖర్చు చేయాలో జేసి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి కమిటీ వెంటనే ఒక నోట్‌ను తయారు చేసి డిఆర్‌ఒకు సమర్పించాలని ఆదేశించారు.

డయల్ యువర్ కలెక్టర్‌కు 19 కాల్స్

సోమవారం నిర్వహించిన డయల్ యువర్ కలెక్టర్ కు 19 కాల్స్ వచ్చాయి. ప్రధానంగా యూరియా సరఫరా పైనే కాల్స్ వచ్చాయి. కలెక్టర్ అంబేద్కర్ స్వయంగా కాలర్స్ తో మాట్లాడి వారి సమస్యను విన్నారు. సక్రమంగా సరఫరా అయ్యేలా చూస్తామని, రైతులు ఆందోళన చెందవద్దని చెప్పారు. రెండో విడత సరఫరాకు ఇంకా సమయం ఉందని తెలిపారు. 997 మెట్రిక్ టన్నుల యూరియా ను కూడా జిల్లాకు 9వ తేదీ సాయంత్రం లేదా 10వ తేదీ ఉదయం జిల్లాకు రానుందని తెలిపారు. కొన్నిచోట్ల పంపిణీ సక్రమంగా జరగడం లేదని రైతులు ఫిర్యాదు చేయగా పోలీస్‌లను పంపించి విచారణ చేయిస్తానని తెలిపారు. యూరియాపై ఫోన్ చేసిన రైతులను పిలిపించి వారి ఫిర్యాదులపై తహశీల్దార్, విఎఒ కలిసి విచారణ జరపాలని కలెక్టర్ ఆదేశించారు.



ధర్నా చేస్తున్న రైతులు, రైతుసంఘం నాయకులు

రైతులను ఆదుకోవాలని ధర్నా

విత్తన ఏజెన్సీ డీలర్, కంపెనీపై చర్యలు తీసుకోవాలని డిమాండ్

ప్రజాశక్తి-విజయనగరం కోట

వరి సాగులో నష్టపోయిన రాజాం మండలం గడ్డి ముడిదాం గ్రామ రైతులకు నష్టపరిహారం ఇప్పించాలని, విత్తనాలు విక్రయించిన డీలర్‌పైనా,కంపెనీపైనా చర్యలు తీసుకోవాలని ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి బి.రాంబాబు, జిల్లా ఉపాధ్యక్షుడు లోకవరపు ఆదినారాయణమూర్తి డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్ వద్ద ఎపి రైతు సంఘం ఆధ్వర్యాన నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ రాజాం మండలంలో రైతులు 1001 రకం వరి విత్తనాలు అడిగితే గంగోత్రి కంపెనీకి చెందిన నకిలీ విత్తలను డీలర్లు ఇచ్చారని తెలిపారు. రైతులకు కంపెనీ డీలర్ రామనారాయణ ఏజెన్సీ ఎటువంటి బిల్లులూ ఇవ్వలేదన్నారు. వరి దుబ్బులు ఈనుతున్న సమయంలో ధాన్యం గింజలు రాకుండా తాలు రావడం, వచ్చిన తరువాత పొట్ట నుంచి పడిపోయి వంగి పోవడం జరుగుతోందన్నారు. ఈ విధంగా 350 ఎకరాల్లో రైతులు నష్టపోయారని తెలిపారు. కలెక్టర్ స్పందించి డీలర్‌పై చర్యలు తీసుకోవాలని, ఎకరాకు రూ.50వేలు పరిహారం ఇప్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గునుపూరువెంకట రమణ, చింత గౌరినాయుడు, చీకటి మాధవరావు, కల్లెపిల్లి తిరుపతి రావు, నడిపిల్లి రాములు, చింత శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కూనేటిగెడ్డకు శాశ్వత పరిష్కారం

మంత్రి సంధ్యారాణి హామీ • అంచనాలు సిద్ధం చేయాలని ఆదేశం

ప్రజాశక్తి- మెంటాడ

మండలంలోని కూనేటిగెడ్డ వల్ల రైతులకు ఎదురవుతున్న ఇబ్బందుల శాశ్వత పరిష్కారానికి మంత్రి గుమ్మడి సంధ్యారాణి హామీఇచ్చారు. ఈమేరకు అంచనాలు రూపొందించాలని ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. కూనేటిగెడ్డకు ఇటీవల గండిపడి పంటపొలాలు నీటమునిగిన నేపథ్యంలో సోమవారం ఆమె గండిపడిన ప్రాంతాన్ని పరిశీలించారు. బాధిత రైతులతో మాట్లాడారు. ప్రతిఏటా గండిపడి పంటలు దెబ్బతింటున్నాయని, ఆర్థికంగా నష్టపోతున్నామని వారు మంత్రి ఎదుట ఆవేదన వ్యక్తంచేశారు. వైసిపి హయాంలో నాటి ఉప ముఖ్యమంత్రి రాజన్నదొర హామీ ఇచ్చినా నెరవేరలేదన్నారు. స్పందించిన మంత్రి సంధ్యారాణి ఈ సమస్య శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. అంచనాలు రూపొందించి అందజేయాలని సూచించారు. అనంతరం, జగన్నాథపురం వద్ద కొట్టుకుపోయిన పైపు కల్వర్టును మంత్రి పరిశీలించారు. తక్షణ మరమ్మతుల నిమిత్తం రెండున్నర లక్షల రూపాయలు విడుదల చేస్తున్నట్టు ప్రకటించారు.



దెబ్బతిన్న పైపు కల్వర్టును పరిశీలిస్తున్న మంత్రి సంధ్యారాణి

ఇక్కడ కల్వర్టు, బ్రిడ్జి.. ఈ రెండింటిలో ఏది ప్రయోజనంగా ఉంటుందో గుర్తించి తన దృష్టికి తీసుకురావాలని మంత్రి సంధ్యారాణి సూచించారు.

బొత్స వ్యాఖ్యలు అనుచితం

గోవా గవర్నర్ అశోక్ గజపతిరాజుపై ఎమ్మెల్సీ బొత్స వ్యాఖ్యలను మంత్రి సంధ్యారాణి తప్పుబట్టారు. వాటిని ఆయన విజ్ఞతకే వదిలిపెడుతున్నానని విలేకరుల ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. అశోక్‌ను విమర్శించే స్థాయి ఏ నేతకూ లేదన్నారు.

అశోక్‌పై బొత్స వ్యాఖ్యలు తగవు

మంత్రి కొండపల్లి శ్రీనివాస్

ప్రజాశక్తి-విజయనగరంకోట

పూసపాటి అశోక్ గజపతి రాజుపై శాసనమండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ అనుచిత వ్యాఖ్యలు చేయడం తగదని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం విదేశీ పర్యటనలో వున్న మంత్రి శ్రీనివాస్ వైసిపి నేత బొత్స చేసిన వివాదాస్పద వ్యాఖ్యలపై స్పందించి ప్రకటన విడుదల చేశారు. ఆదర్శవంతమైన నాయకుల్లో పూసపాటి అశోక్ గజపతి రాజు ప్రథమ వరుసలో నిలిచే నాయకుడని, 45 ఏళ్ళుగా విలువలతో కూడిన రాజకీయాలకు నిలువెత్తు రూపమైన అశోక్ గజపతి రాజు గురించి అవాకులు చవాకులు పేలడం తగదని హితవు పలికారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలలో మంత్రిగా వారు విజయనగరం పట్టణాభివద్ధికి, ఉమ్మడి విజయనగరం జిల్లా ప్రగతిలో వారి పాత్ర అనిర్వచనీయమనీ మంత్రి తెలిపారు. అటువంటి గొప్ప నాయకుడిపై అనుచిత వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. బొత్స సత్యనారాయణ తాను చేసిన వ్యాఖ్యలకు క్షమాపణ చెప్పి వెనకకు తీసుకోవాలని హితవు పలికారు.

ఫిర్యాదుదారులకు న్యాయం చేస్తాం : ఎస్‌పి

ప్రజాశక్తి - కంటోన్మెంట్

ఫిర్యాదు దారులకు చట్ట పరిధిలో న్యాయం చేస్తామని ఎస్‌పి వకుల్‌జిందాల్ తెలిపారు. పిజిఆర్ఎస్‌లో భాగంగా సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో వినతులు స్వీకరించారు. ఫిర్యాదుదారుల సమస్యల పట్ల సానుకూలంగా స్పందించాలని, ఫిర్యాదుల పరిష్కారానికి చట్ట పరిధిలో చర్యలు చేపట్టి, ఫిర్యాదుదారులకు న్యాయం చేయాలని అధికారులను ఆదేశించారు. ఫిర్యాదులపై తీసుకున్న చర్యల వివరాలను నివేదిక రూపంలో జిల్లా పోలీసు కార్యాలయానికి పంపాలని ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు ఎస్‌పి పి.సౌమ్యలత, ఎస్‌బి సిఐ ఎ.వి.లీలారావు, డిసిఆర్‌బి సిఐ బి.సుధాకర్, ఎస్ఐ రాజేష్, సిబ్బంది పాల్గొన్నారు.

సమగ్ర శిక్ష ఉద్యోగులను విద్యాశాఖలో విలీనం చేయాలి

- అక్టోబర్ 12న విజయవాడలో ఆవిర్భావ సభ
- కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ రాష్ట్ర చైర్మన్ బి.కాంతారావు

ప్రజాశక్తి-చీపురుపల్లి

సమగ్ర శిక్ష కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను విద్యా శాఖలో విలీనం చేయాలని, అసెంబ్లీ సమావేశాల్లో చర్చించి కాంట్రాక్ట్ , అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు, ఉద్యోగ భద్రత చట్టం చేయాలని సమగ్ర శిక్ష కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ రాష్ట్ర చైర్మన్ బి.కాంతారావు డిమాండ్ చేశారు. సోమవారం చీపురుపల్లిలో సమగ్ర శిక్ష కాంట్రాక్టు ఉద్యోగులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం తక్షణమే హెచ్.ఆర్ పాలసీ అమలు చేసి ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. కాంట్రాక్టు, ఔట్సోర్సింగ్ ఉద్యోగులకు కనీస వేతనం అందించే విధంగా మినిమమ్ ఆఫ్ టైం స్కేల్ అమలు చేయాలని, గతంలో జరిగిన సమ్మె ఒప్పందాలను అమలు చేసి వేతన పెంపు కల్పించాలని కోరారు. ఉద్యోగుల పదవీ విరమణ వయస్సు 62 ఏళ్లకు పెంచాలని డిమాండ్ చేశారు. ఉద్యోగులకు ఈపిఎఫ్, గ్రాట్యుటీ, మెడికల్ సెలవులు, హెల్త్ కార్డులు వంటి హక్కులు కల్పించాలని, ఔట్‌సోర్సింగ్ సిబ్బందిని కాంట్రాక్ట్ పద్ధతికి మార్చాలని డిమాండ్ చేశారు. ఖాళీగా ఉన్న అన్ని పోస్టులను వెంటనే భర్తీ చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ సందర్భంగా ఇటీవల రాష్ట్రవ్యాప్తంగా జరిగిన సంఘటన పరిశీలిస్తే కెజిబివి పాఠశాలల ప్రిన్సిపల్స్‌పై రాజకీయ ఒత్తిడిని నియంత్రించాల్సిన అవసరం ఉందని అన్నారు. విద్యా వ్యవస్థను రాజకీయ దుర్వినియోగానికి గురి కాకుండా పరిరక్షించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని స్పష్టం చేశారు. ఎపి సమగ్ర శిక్ష కాంట్రాక్టు ఔట్ సోర్సింగ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ జెఎసి ఏర్పడి 10 ఏళ్లు పూర్తి అయిన సందర్భంగా అక్టోబర్ 12న 'దశాబ్ద ఐక్యత - భవిష్యత్తు పోరాట సభ' విజయవాడ ఎంబికె విజ్ఞాన కేంద్రంలో జరుగుతుందని, ఉద్యోగులంతా పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో జిల్లా కమిటీ సభ్యులు ఉమమహేశ్వరావు, వి.రమేష్, నియోజకవర్గ బాధ్యులు పి.బంగారు నాయుడు, జి.కృష్ణం నాయుడు , హైమావతి, రామకృష్ణ, పైడిరాజు , విజయ్ , భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ రాష్ట్ర చైర్మన్ కాంతారావు

ఉత్తమ అవార్డుల ఎంపికపై ఉపాధ్యాయుల్లో వ్యతిరేకత

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

జిల్లా విద్యాశాఖఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా పలువురు ఉపాధ్యాయులను ఎంపిక చేసి, ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులతో సత్కరించింది. వీటిలో చాలా అక్రమాలు చోటు చేసుకున్నాయని విమర్శలు వస్తున్నాయి. ఇష్టారాజ్యంగా ఉపాధ్యాయ అవార్డులు ఇచ్చారంటూ ఉపాధ్యాయ సంఘాలు నేతలు, ఉపాధ్యాయులు వ్యతిరేకిస్తున్నారు. పూర్తి విచారణ జరపాలని డిమాండ్ చేస్తున్నారు. గుర్ల మండలం వల్లాపురం జెడ్‌పి హైస్కూలు స్కూలు అసిస్టెంట్ ఎ.ప్రవీణ్ బెస్ట్ టీచర్ అవార్డు ఉత్సవ కమిటీ సభ్యుడు. గతంలో రాష్ట్ర, జిల్లా స్థాయిలో అవార్డు అందుకున్నారు. మళ్ళీ ఈ సంవత్సరం కూడా ఆయన పేరును చేర్చి అవార్డు ఇవ్వడం పట్ల ఉపాధ్యాయులు వ్యతిరేకిస్తున్నారు. సంతకవిటి మండలం మండవ కురిటి జెడ్‌పి హైస్కూలు ఫిజిక్స్ ఉపాధ్యాయుడు బి.గజపతిరావు పేరు కలెక్టర్ అప్రూవల్ చేసిన అవార్డ్స్ ఫైనల్ జాబితా లేదు. కానీ ఆయన పేరును చేర్చి సెప్టెంబర్ 5న సన్మానం చేశారు. ఎస్.కోట మండలం కొట్టాం జెడ్‌పి హైసూకలు బయోలజీ ఉపాధ్యాయులు పి.స్వప్న గతంలో జిల్లా అవార్డు పొందారు మళ్లీ జిల్లా వార్డుకు ఎంపిక చేశారు. బొబ్బిలి మండలం మండల ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం కె.జోగారావు గతంలో ఎస్.కోట మండలంలో పని చేసినప్పుడు క్రిమినల్ కేసు విషయంలో సస్పెండ్ అయ్యారు. అలాగే బొబ్బిలి మండలంలో మహిళలపై అనుచిత ప్రవర్తన విషయంలో కోర్టులో కేసు పెండింగ్‌లో ఉంది. ఈయనను కూడా అవార్డుకు ఎంపిక చేయడం పట్ల ఉపాధ్యాయులు వాపోతున్నారు. వీటితోపాటుగా జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుల కార్యక్రమం నిర్వహణ కోసం, రాష్ట్ర ప్రభుత్వం లక్ష రూపాయలు మంజూరు చేసింది. కనీసం ఉపాధ్యాయులకు మధ్యాహ్నం లంచ్ కూడా పెట్టలేదని ఉపాధ్యాయ సంఘాలు నాయకులు విమర్శిస్తున్నారు.



జాబితాలో లేకపోయిన ఉపాధ్యాయుడికి అవార్డు ఇస్తున్న అధికారులు(ఫైల్)

సమగ్ర విచారణ జరపాలి

ఉపాధ్యాయ అవార్డులపై సమగ్ర విచారణ జరపాలి. గతంలో తీసుకున్న వారికి, క్రిమినల్ కేసులు ఉన్న వారికి అవార్డులు ఎలా ఇస్తారు. - డి.శ్యామ్, ఎస్‌టియు నాయకులు

స్కూల్ గేమ్స్ షెడ్యూల్ విడుదల

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

2025-2026 విద్యా సంవత్సరానికి సంబంధించి జిల్లా విద్యా శాఖ ఆధ్వర్యంలో నిర్వహించు జిల్లా స్కూల్ గేమ్స్ కేలండర్ ప్రకారం అండర్ 11,14,17 బాలుర, బాలికల వయో విభాగాల జిల్లా స్కూల్ గేమ్స్ జట్లు ఎంపిక ఉమ్మడి జిల్లా స్థాయిలో నిర్వహించనున్నట్లు డిఇఒ యు.మాణిక్యంనాయుడు, జిల్లా స్కూల్ గేమ్స్ కార్యదర్శులు కె.గోపాల్, ఎస్.విజయలక్ష్మి తెలిపారు. సోమవారం విద్యాశాఖ కార్యక్రమాలు షెడ్యూల్ ను విడుదల చేశారు. అండర్ -11 వయసు విభాగంలో 1-1-2015 తరువాత జన్మించిన వారై ఉండాలని, 6-14 వయసు వారు 1-1-2012 లోపు ఉండాలని తెలిపారు. ఎంపికలకు వచ్చే క్రీడాకారులను వయస్సు ధ్రువీకరణ పత్రం, క్రీడా సామాగ్రితో రావాలని తెలిపారు. అండర్ -17 పోటీలకు 1-1-2009 తరువాత జన్మించిన వారై ఉండాలన్నారు. ఓపెన్ స్కూల్, ఐటిఐ పాలిటెక్నిక్ విద్యార్థులు పై క్రీడలకు అర్హులు కారని తెలిపారు.

ఎంపికలు జరిగే పాఠశాలలు

సెపక్ తక్రా : అండర్ -14,17, బాల బాలికలు ఈనెల 10న అలుగోలు జెడ్‌పి హైస్కూలు ; **టేబుల్ టెన్నిస్ :** అండర్ 14,17 విభాగంలో పిఎస్ఆర్ స్కూలు, రింగ్ రోడ్డు, విజయనగరం; **మాల్కంబ్ :** అండర్ -14,17 విభాగాలు, పిఎస్ఆర్ స్కూల్ రింగ్‌రోడ్డు, విజయనగరం; **పెన్సింగ్ :** అండర్-14,17 విభాగాలకు ఈనెల 11న విజ్జీ స్టేడియం; **ఫుట్‌బాల్ :** అండర్- 14,17 బాల బాలికలు విభాగాలకు ఈనెల 11న రాజీవ్ స్టేడియం; **వెయిట్ లిఫ్టింగ్ :** అండర్-17 బాల, బాలికల విభాగాలకు ఈనెల 11న కోడి రామమూర్తి, వ్యాయమశాల, విజయనగరం.

పిజిఆర్ఎస్‌కు 167 వినతులు

ప్రజాశక్తి-కంటోన్మెంట్

ప్రజా వినతుల పరిష్కార వేదికకు వచ్చే వినతులను లాగిన్ లో అధికారులు ఎప్పటికప్పుడు చూడాలని కలెక్టర్ బి.ఆర్. అంబేద్కర్ తెలిపారు. సోమవారం పిజిఆర్ఎస్ లో కలెక్టర్ ప్రజల నుండి 167 వినతులు స్వీకరించారు. కలెక్టర్ తో పాటు సంయుక్త కలెక్టర్ సేతు మాధవన్, డిఆర్ఒ శ్రీనివాస మూర్తి, విజయనగరం డిప్యూటీ కలెక్టర్లు వెంకటేశ్వర రావు, ప్రమీల గాంధీ, మురళి ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. మొత్తం 167 అర్జీలు అందగా, భూ సమస్యలకు సంభందించి రెవిన్యూ శాఖకు అత్యధికంగా 58 వినతులు అందాయి. అనంతరం అధికారులను ఉద్దేశించి కలెక్టర్ మాట్లాడుతూ గడువు లోపలే వినతులకు సమాధానాలు పంపాలని , లేని యెడల సంబందిత అధికారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు.



అర్జీని పరిశీలిస్తున్న కలెక్టర్ అంబేద్కర్

గౌరవ వేతనం చెల్లించాలి

రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ముస్లిములకు కూటమి ప్రభుత్వం గౌరవ వేతనం చెల్లించాలని రాష్ట్ర మైనారిటీ కమిటీ అధికార ప్రతినిధి ఎండి నజీర్ కోరారు. సోమవారం కలెక్టరేట్ వద్ద నిరసన తెలిపాటు. అనంతరం జాయింట్ కలెక్టర్ సేతు మాధవన్ కు వినతిపత్రం సమర్పించారు .ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇమామ్‌లకు రూ. 10వేలు, మౌజాన్ లకు రూ. 5వేలు గౌరవం వేతనం ఇస్తామని కూటమి ప్రభుత్వం హామీ ఇచ్చిందన్నారు. కానీ ఇంతవరకు చెల్లింపులు చేయలేదన్నారు. 2025 సెప్టెంబర్ నాటికి ఎనిమిది నెలల గౌరవ వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. 2024 ఏప్రిల్, మే, జూన్ నెలలు గౌరవ వేతనం చెల్లించ లేదన్నారు. ప్రభుత్వం స్పందించి వెంటనే చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో కో ఆప్షన్ మెంబర్ మస్తాన్, రియాజ్ ఖాన్ , మదీనా, భాషా, సైయా ద్ రియాజ్ ,తాజుద్దీన్ మహమ్మద్ పాల్గొన్నారు.

ప్రయివేటు ఎలక్ట్రికల్ వర్కర్ల ధర్నా

విజయనగరంటౌన్ : నగరంలోని వందలాది మంది ప్రైవేట్ ఎలక్ట్రీషియన్లు, రివైండర్స్ తమ సమస్యలను పరిష్కరించాలని సోమవారం కలెక్టరేట్ వద్ద ప్రైవేట్ ఎలక్ట్రిషన్ వెల్ఫేర్ అసోసియేషన్స్ ఆధ్వర్యాన ధర్నా నిర్వహించారు. పని భద్రత కల్పించాలని, ప్రభుత్వం అనుమతులేని అల్యూమినియం ఎలక్ట్రికల్ పరికరాల అమ్మకాలను అరికట్టాలని భవన నిర్మాణ సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని నినదించారు. ఈసందర్భంగా అసోసియేషన్ తరపున బి.గిరిప్రసాద్ మాట్లాడుతూ భవన నిర్మాణం సంక్షోభం కారణంగా ప్రైవేట్ ఎలక్ట్రీషియన్ల ఉపాధి దొరకడం లేదని, దీంతో వందలాది కుటుంబాలు ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. అల్యూమినియం ఫ్యాన్‌లు, మిక్సీలు అల్యూమినియం కాపరు వైండింగ్ కోర్లు నకిలీ రావడం, ఎలక్ట్రికల్ వైర్లు కూడా నాసిరకమైనవి చలామణి కావడం వల్ల వినియోగదారులతోపాటు వృత్తిదారులు కూడా నష్టపోతున్నామని తెలిపారు. ధర్నాలో పి.పవన్, ఎలక్ట్రికల్ వర్కర్లు పాల్గొన్నారు.


కేక్ కట్ చేసి తినిపించుకుంటున్న ఎల్ఐసి ఉద్యోగులు

జిఎస్‌టి తొలగింపుతో ప్రయోజనం

ప్రజాశక్తి - గరివిడి

కేంద్ర ప్రభుత్వం ఇన్సూరెన్స్ పాలసీలపై జిఎస్‌టిని తొలగించడం శుభ పరిణామమని ఎల్ఐసి బ్రాంచ్ మేనేజర్ బోని వెంకటకుమార్ తెలిపారు. సోమవారం బ్రాంచ్ కార్యాలయంలో ఎఒఐ ఏజెంట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి వేడుకలు నిర్వహించారు. పాలసీదారులకు, ఏజెంట్లకు, సిబ్బందికి స్వీట్లు పంచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎల్ఐసి పాలసీలపై జిఎస్‌టి రద్దుతో పాలసీదారులపై ఆర్థిక భారం తగ్గిందన్నారు. దీనివల్ల ప్రజలకు మేలు జరుగుతుందని చెప్పారు. కార్యక్రమంలో క్లాస్ వన్ ఆఫీసర్స్ అసోసియేషన్ ప్రతినిధి జేజే రామారావు, ఇన్సూరెన్స్ ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్షులు, కార్యదర్శులు సిద్ధార్థ, వెంకటేష్, ఏజెంట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు నడిమింటి సత్యనారాయణ, కార్యదర్శి ఎల్లం నాయుడు, డిఒఐ అసోసియేషన్ ప్రతినిధి ఎంపి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

బల్లంకిలో 266 బస్తాల యూరియా పంపిణీ

ప్రజాశక్తి-వేపాడ

మండలంలో బల్లంకి గ్రామంలో 266 బస్తాలను యూరియాను సోమవారం రైతులకు పంపిణీ చేశారు. ఈ పంపిణీ ప్రక్రియను మండల ప్రత్యేకాధికారి ఎస్.చిరెడ్డయ్య పర్యవేక్షించారు. యూరియా కోసం రైతులు ఆందోళన చెందవద్దని, అందరికీ యూరియా అందుబాటులో ఉంచుతామని ఆయన తెలిపారు. ఇప్పటివరకు 262 మెట్రిక్ టన్నుల యూరియా పంపిణీ చేశామన్నారు. ఈ వారంలో 72 మెట్రిక్ టన్నులు అందుబాటులోకి తీసుకువస్తామన్నారు. ఎఒ స్వాతికుమారి, ఎఇఒ, వివిఎ పాల్గొన్నారు.

శక్తి యాప్‌పై విద్యార్థులకు అవగాహన

ప్రజాశక్తి - నెల్లిమర్ల

మండలంలోని సతివాడ మోడల్ స్కూల్, ఉన్నత పాఠశాల, జెబిఎస్‌ఎం కళాశాలలో శక్తి టీమ్ ఆధ్వర్యంలో శక్తి యాప్‌పై ఎస్ఐ బి.గణేష్ విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన ప్రస్తుత సమాజంలో మహిళలపై జరుగుతున్న దాడులు, వాటి పరిణామాలు, ఈవ్ టీజింగ్, మహిళలకు ఆత్మరక్షణ, భవిష్యత్తులో మంచిగా స్థిరపడాలంటే ఏం చేయాలి, ఏ విధంగా చదవాలి అనే అంశాలపై అవగాహన కల్పించారు. ప్రతి ఒక్క విద్యార్థి కష్టపడి చదివినట్లయితే గొప్ప వ్యక్తులుగా మారి సమాజానికి ఎంతో ఉపయోగకరమైన వ్యక్తులుగా మారుతారన్నారు. చెడు వ్యసనాలకు లోనైతే భవిష్యత్తు నాశనమైపోతుందన్నారు. కాలేజీలో గాని పరిసర ప్రాంతాల్లో గాని ఎవరైనా ఈవ్ టీజింగ్ చేసినట్టు తమ దృష్టికి వస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఎపిజిఇఎ కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి - నెల్లిమర్ల

ఆంధ్రప్రదేశ్ గవర్నమెంట్ ఎంప్లాయిస్ అసోసియేషన్, నెల్లిమర్ల తాలూకా యూనిట్‌ను సోమవారం కో ఆప్షన్ ద్వారా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నెల్లిమర్ల తాలూకా అధ్యక్షులు పాగి వీరన్నదొర ఆధ్వర్యంలో ఎన్నికల పరిశీలకులుగా ఎపిజిఇఎ జిల్లా అధ్యక్షులు కంది వెంకటరమణ, జిల్లా సభ్యులు పి.మేరీ, చీపురుపల్లి అధ్యక్షులు పిన్నింటి హరి ఆధ్వర్యంలో నిర్వహించారు. జనరల్ సెక్రటరీగా పిసి నవీన్ (మెడికల్), ఆర్గనైజింగ్ సెక్రటరీగా రఘు, వైస్ ప్రెసిడెంట్లుగా బి. గోవింద (పిఎస్) బి.త్రినాథరావు (వివిఎల్), జాయింట్ సెక్రటరీలుగా ఎస్.చంద్రశేఖర్ (డిఎ), రఘు (విఆర్ఒ), రాజ్యలక్ష్మి (పిఎస్), ఎడ్విన్ (డిఎ)ను ఎన్నుకున్నారు.

మేకల కళేబరాలు పరిశీలన

ప్రజాశక్తి-వేపాడ

మండలంలోని కొండగంగుపూడిలో పిడుగుపాటుతో ఆదివారం సాయంత్రం 30 మేకలు మృతిచెందిన విషయం తెలిసిందే. మేకల కళేబరాలను సోమవారం తహశీల్దార్ జె.రాములమ్మ, మండల పశువైద్యాధికారి గాయత్రి పరిశీలించారు. నివేదికను ఉన్నతాధికారులకు అందిస్తామని తహశీల్దార్ తెలిపారు.

సోంపురంలో అక్షరాస్యతా దినోత్సవం

ప్రజాశక్తి-వేపాడ

మండలంలోని సోంపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం అంతర్జాతీయ అక్షరాస్యతా దినోత్సవాన్ని నిర్వహించారు. విద్యార్థులు 'అ' అక్షర నమూనాను ప్రదర్శించారు. వక్తృత పోటీలు నిర్వహించి, విద్యార్థులకు ప్రధానోపాధ్యాయులు బి.పి.ఎ.రాజు బహుమతులు అందించారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు ఎస్.గోవిందరావు, తెలుగు ఉపాధ్యాయులు వి.జగన్నాథం, బి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పాఠశాలల సందర్శన

రాయుడుపేట ప్రాథమికపాఠశాల, బక్కునాయుడు పేట కెజిబివిని సోమవారం ఎంఇఒ పి.బాలభాస్కరరావు సందర్శించారు. పాఠశాల పరిసరాలు, తరగతి గదులు పరిశీలించారు. కెజిబివిలో పదో విద్యార్థులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో సిఆర్‌ఎంటి వై.వెంకటలక్ష్మి, కె.రామప్రసాద్ పాల్గొన్నారు.

గుంకలాంలో..

విజయనగరం కోట : జిల్లా స్థాయి 59వ అంతర్జాతీయ అక్షరాస్యతా దినోత్సవ కార్యక్రమం సోమవారం వయోజన విద్యా శాఖ నోడల్ అధికారి ఎ.వేణు గోపాలకృష్ణ ఆధ్వర్యంలో గుంకలాం జెడ్‌పి ఉన్నత పాఠశాల ఆవరణలో జరిగింది. హెచ్‌ఎం ఎ.శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో స్కూలు కమిటీ చైర్మన్ లెంక రమణ పాల్గొన్నారు. ముందుగా ర్యాలీ నిర్వహించారు. అనంతరం జరిగిన సమావేశంలో అక్షరాస్యతా ప్రాధాన్యతను వివరించారు. పాఠశాల విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన, డిబేట్, మరియు సాంస్కృతిక కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

విద్యార్థినులకు ఆత్మరక్షణలో శిక్షణ

ప్రజాశక్తి-బొబ్బిలి

స్థానిక అభ్యుదయ విద్యాసంస్థలో విద్యార్థినులకు ఆత్మరక్షణ తరగతులను సోమవారం డిఎస్‌పి భవ్యరెడ్డి ప్రారంభించారు. తైక్వాండో శిక్షకులు ఎం.సుధాకర్ ఆధ్వర్యాన ఈ తరగతులను నిర్వహిస్తున్నారు. కార్యక్రమంలో అభ్యుదయ విద్యాసంస్థల కరస్పాండెంట్ ఎం.కె.నాయుడు, ప్రిన్సిపల్ శారద, ఉపాధ్యాయులు, తైక్వాండో శిక్షకులు ఉమా మహేశ్వర రావు, హేమంత్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్తు సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి-వేపాడ

మండలంలో మంగళవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటలకు విద్యుత్తు సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఆ శాఖ డిఇఇ బి.సురేష్‌బాబు ఒక ప్రకటనలో తెలిపారు. వేపాడ, వల్లంపూడి, దబ్బిరాజుపేట, చామలాపల్లి, కరకవలస, ఎన్‌కెఆర్‌పురం, విసినిగిరిపాడు, సంజీవిరిపాలెం, కరకొండ, ఎన్‌కెఆర్‌పురం, విసినిగిరిపాడు, పెదగుడిపాలెం, భరతవానిపాలెం, బల్లంకి, కె.ఆర్.పేట, కుంపల్లిలో విద్యుత్తు అంతరాయం ఏర్పడుతుందని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

ప్రభుత్వ భూమిని కాపాడాలని వినతి

ప్రజాశక్తి-బొబ్బిలి

బొబ్బిలి పట్టణంలోని శ్రీలక్ష్మి శ్రీనివాస జ్యూట్ మిల్ స్థలంలో ఉన్న ప్రభుత్వ భూమిని కబ్జా చేశారని, ఆక్రమణ చెర నుంచి కాపాడాలని సిపిఐ జిల్లా కార్యదర్శి ఒమ్మి రమణ.. ఆర్‌డిఒ కార్యాలయంలో సోమవారం వినతి అందించారు. సిపిఐ జిల్లా నాయకులు కోట అప్పన్న, ముసలాల శ్రీనివాస్ పాల్గొన్నారు.

శరవేగంగా రోడ్ల మరమ్మతులు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరంలో వివిధ ప్రాంతాలలో అభివృద్ధి, మరమ్మతు పనులు శరవేగంగా సాగుతున్నాయి. నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య ఆదేశాలతో ఇంజినీరింగ్ అధికారులు, సిబ్బంది వివిధ పనుల్లో నిమగ్నమయ్యారు. రానున్న పైడితల్లి అమ్మవారి జాతర నేపథ్యంలో ఇంజనీరింగ్ పనులను ముమ్మరం చేస్తున్నారు. ఈనెల 20వ తేదీ నాటికి నిర్దేశిత పనులు పూర్తి కావాలని కమిషనర్ సిబ్బందికి నిర్దేశించారు. దీంతో పనుల ప్రక్రియ ఊపందుకుంది. స్థానిక రాజారావు మేడ వద్ద బి.టి. రహదారి మరమ్మతు పనులు సాగుతున్నాయి. ప్రశాంతి నగర్ లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం యొక్క కాంక్రీట్ పని జరుగుతుంది. గాయత్రి నగర్ లో సిసి రోడ్డు నిర్మాణం సాగుతోంది. మయూరి ఎత్తు బ్రిడ్జి వద్ద సిసి బెర్మ్ పనులు చేపట్టారు. కాటవీధి వద్ద కల్వర్టు మరమ్మత్తు పనులు పూర్తి చేశారు. గాయత్రి నగర్‌లో సిసి రోడ్డు పనులు జరుగుతున్నాయి. కాళీమాత టెంపుల్ ప్రాంతంలో రింగ్ రోడ్డు పరిసరాలలో ఉన్న డివైడర్ గ్రిల్స్ కు రకరకాల రంగులను అద్దుతున్నారు. ఆయా పనులను డిఇ శ్రీనివాసరావు, ఎఇలు ప్రత్యక్షంగా పర్యవేక్షిస్తున్నారు. నెల్లిమర్ల మాస్టర్ పంప్ హౌస్ ప్రాంతాన్ని డిఇ నరసింహారెడ్డి పరిశీలించారు. ఈనెల 20వ తేదీలోగా పనులు పూర్తి చేసి ప్రజలకు భక్తుల కోసం నగరాన్ని శోభాయమానంగా తీర్చిదిద్దునున్నట్లు కమిషనర్ చెప్పారు.


జోరుగా సాగుతున్న రహదారి మరమ్మతు పనులు

నగరపాలక సంస్థ అధికారులపై ఎమ్మెల్యే ఆగ్రహం

రైతుబజార్ స్థలం గుర్తించేందుకు ఇంకా ఎంత కాలం?

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

రైతు బజారు కోసం స్థలాన్ని గుర్తించేందుకు ఎన్నాళ్లు సమయం కావాలి? మీకు ఎమ్మెల్యే చెబితే చెయ్యరా.. రైతులు వ్యాపారాలు పోయి ఎన్నాళ్లు రోడ్డు మీద ఉంటారు' అంటూ నగరపాలక సంస్థ అధికారుల తీరుపై ఎమ్మెల్యే పూసపాటి అతిథి విజయలక్ష్మి గజపతిరాజు ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది. నాలుగు రోజుల క్రితం నగర పాలక సంస్థ కమిషనర్ కొంతమంది అధికారులతో ఎమ్మెల్యే తన నివాసంలో సమావేశం నిర్వహించారు. నగర పాలక సంస్థలో జరుగుతున్న పనులు, పరిణామాలు గురించి ఆరా తీశారు. ఇటీవల పాత ఆసుపత్రి, ఎమ్మార్వో కార్యాలయం పక్కనే ఉన్న రైతు బజారును ఖాళీ చేయించిన విషయం తెలిసిందే. ప్రస్తుతానికి కొంతమంది రైతులకు మాత్రం దాసన్నపేట రైతుబజార్ వద్ద అవకాశం కల్పించారు. 57 మంది రైతుల కోసం స్థలాన్ని చూసి రైతు బజార్ ఏర్పాటు కోసం స్థలం గుర్తింపు ఎంతవరకు వచ్చిందని ఎమ్మెల్యే ప్రశ్నించారు. స్థలాలు చూస్తున్నామని అధికారులు చెప్పడంతో ఎన్నాళ్లు సమయం కావాలని ఆమె ప్రశ్నించినట్లు తెలిసింది. ఎమ్మెల్యే చెప్పిన పనే మీరు చేయకపోతే సామాన్యుల పనులు ఏం చేస్తారని ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది. అధికారులు మార్కెట్ యార్డు వద్ద స్థలం చూశామని, మార్కెట్ యార్డు వారు ఒప్పుకోవడం లేదని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిసింది. పెద్ద చెరువు గట్టు వద్ద బుద్ధ విగ్రహం ఎదురుగా ఏర్పాటుకు నగర పాలక సంస్థ పార్కింగ్‌కు కేటాయించడం వలన సాధ్యం కాలేదని ఎమ్మెల్యేకు చెప్పినట్లు తెలిసింది. దీంతో మీరు ఎన్నాళ్లు అయినా ఇలాగే ఉంటారు, రైతులకు షాపులు ఇవ్వకుండా ఉంచడం సరికాదని ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది. రెండోపట్టణ పోలీసు స్టేషన్ దగ్గర రైతు బజార్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఎమ్మెల్యే ఆదేశించినట్లు తెలిసింది. నగర పాలకసంస్థలో జరుగుతున్న పరిణామాలు పట్ల ఎమ్మెల్యే అసంతృప్తితో ఉన్నట్లు చర్చ జరుగుతోంది.

ఆక్రమణదారులపై చర్యలు చేపట్టాలి

ప్రజాశక్తి - నెల్లిమర్ల

మండలంలోని తంగుడుబిల్లి గ్రామంలో సర్వే నెంబర్ 72 /1 లోని తమ 2.40 ఎకరాల భూమిలోకి ప్రవేశించి అక్రమంగా మట్టి తవ్వి, గట్లు వేసిన వారిపై పోలీసులు, రెవెన్యూ అధికారులు తక్షణమే చర్యలు చేపట్టాలని ఆ గ్రామానికి చెందిన రెడ్డి అప్పలస్వామి, పాలూరి నారాయణమ్మ డిమాండ్ చేశారు. సోమవారం వారు ఆ గ్రామంలో నిరసన తెలిపారు. అనంతరం మాట్లాడుతూ సర్వే నెంబర్ 72/1లోని 2.40 ఎకరాల భూమిపై యాజమాన్య హక్కులకు సంబంధించి తమ వద్ద పత్రాలు ఉన్నాయని చూపించారు. గ్రామానికి చెందిన కొంత మంది అర్ధరాత్రి పూట అక్రమంగా తమ పొలంలోనికి ప్రవేశించి భారీ యంత్రాలతో మట్టిని తవ్వి గట్లుగా చేశారని వారిపై కేసులను నమోదు చేసి చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ విషయంపై ఇప్పటికే పోలీసులకు రెవెన్యూ అధికారులకు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశామని చెప్పారు. ఆ భూమికి సంబంధించిన యజమానులు కోలాపు నారాయణరెడ్డి, నీలాపు చిన్నారెడ్డిల నుంచి సుమారు 35 ఏళ్ల క్రితం తాము కొనుగోలు చేసుకున్నామని ఒప్పంద పత్రాలు కూడా తమ వద్ద ఉన్నాయని వారు వివరించారు. ఆ భూమిని ప్రభుత్వ చెరువుగా చిత్రీకరించడానికి కొంతమంది రైతులు కుట్రపన్నారని ఆరోపించారు. ఆ భూములో ఏనాడు ఇంతవరకు చెరువు లేదని కొంత మంది రైతులు అధికారులను తప్పుదోవ పట్టిస్తున్నారని అప్పలస్వామి, నారాయణమ్మ వివరించారు. రెవెన్యూ అధికారులు తమ వద్దనున్న రికార్డులను పరిశీలించి ఆ భూమి జిరాయితీదిగా ప్రకటించారని ఈ విషయాన్ని రైతులు తెలుసుకోవాలని సూచించారు. ఆ భూమిలో చెరువు లేదన్న విషయంపై ఇరిగేషన్ విభాగం అధికారులు కూడా స్పష్టం చేశారని తెలిపారు. రైతులకు అనుమానాలుంటే నేరుగా అధికారులను ఆశ్రయించి వివరాలను తెలుసుకోవాలన్నారు. తమ భూమిని అక్రమ పద్ధతిలో సొంతం చేసుకునేందుకు సదరు రైతులు విఫలయత్నం చేస్తున్నారని ఆరోపించారు. తమపై దౌర్జన్యం చేసేందుకు సైతం ఆ రైతులు వెనుకాడడం లేదని తమకు తమ కుటుంబీకులకు ప్రాణ రక్షణ కల్పించాలని అప్పలస్వామి, నారాయణమ్మ కోరారు. ఈ కార్యక్రమంలో బాధిత కుటుంబీకులు పాలూరి ఆదినారాయణ, పాలూరి ప్రసాద్, కోరాడ శైలజ తదితరులు పాల్గొన్నారు.


తంగుడుబిల్లిలో నిరసన తెలుపుతున్న బాధితులు



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న డిఎల్ఎస్ఎ కార్యదర్శి ఎ.కృష్ణ ప్రసాద్

బాల్య వివాహాలు వద్దు

ప్రజాశక్తి-గంట్యాడ

బాల్య వివాహాలు వద్దని జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి ఎ.కృష్ణప్రసాద్‌సూచించారు.సోమవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటుచేసిన న్యాయ అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. 18 ఏళ్లలోపు బాల బాలికలకు వివాహం చేయడం చట్టరీత్యా నేరమని, అందుకు రెండేళ్ల వరకు జైలు శిక్ష ఉంటుందని తెలిపారు. చిన్న వయసులోనే వివాహాలు చేయటం వల్ల అనేక అనేక అనారోగ్య సమస్యలు. శారీరక సమస్యలు ఏర్పడతాయని అన్నారు. బాల్య వివాహాల రద్దు చట్టం గురించి బాల బాలికలకు వారికి అర్థమయ్యే రీతిలో తెలియజేశారు ఒకవేళ ఎవరైనా ఎక్కడైనా ఎప్పుడైనా బాల్య వివాహం జరిగినట్లు లేదా చేస్తున్నట్లు తెలిస్తే వెంటనే చైల్డ్ లైన్ టోల్ ఫ్రీ నెంబర్ నెంబర్ 1098 కు లేదా జాతీయ న్యాయ సేవా అధికార సంస్థ ఏర్పాటు చేసిన టోల్ ఫ్రీ నెంబర్ 1 5 1 0 0 కు ఫోన్ చేసి చెప్పాలని కోరారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఎల్‌వి జగన్నాథ రావు, ఎస్ఐ సాయికృష్ణ, వన్‌స్టాప్ సెంటర్ ఎఒ సాయి విజయలక్ష్మి, అధ్యాపకులు పాల్గొన్నారు.

శిశుగృహంలో తనిఖీలు

ప్రజాశక్తి- కంటోన్మెంట్

కెఎల్ పురంలో నిర్వహిస్తున్న శిశు గృహం, కనపాకలో నిర్వహిస్తున్న నవజీవన్ చిల్డ్రన్ హోమ్ ను జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి ఎ.కృష్ణప్రసాద్ సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. హోంలో ఉంటున్న బాల బాలికలకు సరైన వసతి సౌకర్యాలు ఉన్నవి లేనిదీ తనిఖీ చేశారు. ప్రభుత్వ పథకాలు పిల్లలకు అందుతున్నాయా లేదా వివరాలు అడిగి తెలుసుకున్నారు.

11,12 తేదీల్లో వారసత్వ కళల పోటీలు

ప్రజాశక్తి - నెల్లిమర్ల

ప్రభుత్వ ఉపాధ్యాయ విద్య శిక్షణా సంస్థ (డైట్)లో ఈ నెల 11, 12 తేదీల్లో భారతీయ సంస్కృతి, సంప్రదాయ, వారసత్వ కళలు పోటీలు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ కె. రామకృష్ణరావు తెలిపారు. సోమవారం డైట్‌లో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. డైట్‌లో ఏక్ భారత్ శ్రేష్ట భారత్ థిమ్‌తో రెండు రోజులు పాటు భారతీయ సంస్కృతి, సాంప్రదాయ వారసత్వ కళల పోటీలు కళా రూపాలతో నిర్వహిస్తామన్నారు. ఈ పోటీల్లో ప్రభుత్వ గుర్తింపు ఉన్న విద్యాసంస్థల్లో 9,10, 11, 12 తరగతులకు చెందిన ఆసక్తి ఉన్న విద్యార్థులు పాల్గొన వచ్చన్నారు. అనంతరం కళా ఉత్సవ్ ఇంచార్జి వాక చిన్నంనాయుడు మాట్లాడుతూ 11న గాత్ర సంగీతం వ్యక్తిగత, బృందం, వాయిద్య సంగీతం వ్యక్తిగత, నృత్యం వ్యక్తిగత బృందం విభాగాల్లో పోటీలు నిర్వహిస్తామన్నారు. 12న థియేటర్ ఆర్ట్స్, విజువల్ ఆర్ట్స్ 2డి, 3డి, సాంప్రదాయ కథాకథనం విభాగాల్లో పోటీలు ఉంటాయన్నారు. రిజిస్ట్రేషన్ 10వ తేదీ సాయంత్రం 4 గంటల్లోగా 9440912863 వాట్సాప్ ద్వారా చేసుకోవాలని కోరారు. వైస్ ప్రిన్సిపాల్ అప్పల నాయుడు, ఫాకల్టీ మెంబెర్స్ రమేష్, సూరిబాబు, తిరుపతిరావు, అప్పారావు, అన్నారావు, శ్రీనివాసరావు, శర్మ, సోమయాజులు, సూర్యకళ, తదితరులు పాల్గొన్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో భారీ జరిమానా

ప్రజాశక్తి-రామభద్రపురం

మద్యం సేవించి వాహనం నడిపిన వ్యక్తికి రూ.10 వేలు జరిమానా విధించినటు ఎస్ఐ ప్రసాదరావు తెలిపారు. ఇటీవల నిర్వహించిన వాహన తనిఖీల్లో బీహార్ రాష్ట్రానికి చెందిన లారీ డ్రైవర్ రాంబాలి కుమార్ మద్యం సేవించి వాహనం నడుపుతూ పట్టుబడ్డాడు. ఆయనకు సోమవారం సాలూరు మున్సిఫ్ మెజిస్ట్రేట్ రూ.10 వేలు జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారని ఎస్ఐ తెలిపారు.

అక్షరాస్యతతోనే అభివృద్ధి

ప్రజాశక్తి-రామభద్రపురం

ప్రతిఒక్కరూ అక్షరాస్యులైతేనే అభివృద్ధి సాధ్యపడుతుందని కారుణ్య సంస్థ చైర్మన్ జెసి రాజు అన్నారు. అంతర్జాతీయ అక్షరాస్యతా దినోత్సవాన్ని పురస్కరించుకొని సోమవారం నాయుడువలసలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిఒక్కరూ అక్షరాస్యులు కావాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. అక్షరాస్యత అంటే కేవలం చదవడం, రాయడమే కాదని, స్వతంత్ర ఆలోచనా సామర్థ్యంతో నిర్ణయం తీసుకోవాలన్నారు. అక్షర్యాసత పెంపునకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం విద్యార్థులు ప్లకార్డులు పట్టుకొని ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్ రాజశేఖర్, మహిళా పోలీసు మాలతి, గ్రామపెద్ద రామినాయుడు తదితరులు పాల్గొన్నారు.

సమయపాలన పాటించని వారిపై చర్యలు

ప్రజాశక్తి-రామభద్రపురం

సమయపాలన పాటించని సచివాలయ ఉద్యోగులపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎంపిడిఒ రత్నం తెలిపారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో సోమవారం ఆమె మాట్లాడుతూ ఉద్యోగులంతా నిర్ణీత సమయానికే కార్యాలయానికి చేరుకోవాలని సూచించారు. గ్రీవెన్స్‌లో ఇచ్చిన ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాల న్నారు. ప్రభుత్వ పథకాలను ప్రజలకు అందించడంలో అలసత్వం చూపరాద న్నారు. గ్రామ పంచాయతీల్లో ఎప్పటికప్పుడు సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఇళ్ల పన్నుల వసూళ్లు వేగవంతం చేయాలని సూచించారు. ప్రజలకు తాగునీటి సరఫరాలో అంతరాయం రాకుండా చూడాలన్నారు. సమావేశంలో రామభద్రపురం పంచాయతీ ఇఒ సూరిబాబు పాల్గొన్నారు

అభివృద్ధి ప్రదాత చంద్రబాబే : మడక

ప్రజాశక్తి-రామభద్రపురం

అభివృద్ధి ప్రదాత చంద్రబాబేనని టిడిపి జిల్లా ఉపాధ్యక్షులు మడక తిరుపతినాయుడు అన్నారు. బూసాయవలసలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. యువతకు ఉపాధి కల్పించాలన్న ఉద్దేశంతో భారీ పరిశ్రమలను రాష్ట్రానికి రప్పించడంలో చంద్రబాబు శ్రమిస్తున్నారని అన్నారు. ఎన్నికల ముందు కూటమి ఇచ్చిన అన్ని హామీలను నెరవేర్చి ప్రజా సంక్షేమం కోసం కృషి చేస్తున్నారన్నారు. సమావేశంలో టిడిపి మండల క్లస్టర్ ఇన్‌ఛార్జి గంట సాయి, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

తైక్వాండోతో ఆత్మరక్షణ

ప్రజాశక్తి-వంగర

తైక్వాండోతో బాలికలకు ఆత్మరక్షణ కలుగుతుందని కోచ్ శ్రీను అన్నారు. సోమవారం స్థానిక జెడ్‌పి ఉన్నత పాఠశాలలో బాలికలకు తైక్వాండో శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ఎస్ ఐ షేక్ శంకర్, ఎంఇఒ-2 మీసాల కుర్మినాయుడు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


విద్యార్థులకు శిక్షణ ఇస్తున్న కోచ్ శ్రీను

5వేల ఎకరాల్లో ఐటి పార్కులు

త్వరలో భూ సేకరణ : కలెక్టర్

ప్రజాశక్తి-కంటోన్మెంట్

భోగాపురం విమానాశ్రయం సమీపంలో ఐటి పార్కులను ఏర్పాటు చేయడానికి ప్రభుత్వం సన్నద్ధమవుతుంది. దీనిలో భాగంగా సుమారు 5వేల ఎకరాలను ఐటి పార్కులను స్థాపన కోసం సేకరించనున్నట్లు జిల్లా కలెక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ప్రకటించారు. త్వరలోనే భూసేకరణ ప్రారంభిస్తామని ఆయన తెలిపారు. ఉత్తరాంధ్ర లోని విశాఖ, విజయనగరం, శ్రీకాకుళం, అనకాపల్లి తదితర జిల్లాల కలెక్టర్లు, జెసిలు, ఇతర ఉన్నతాధికారులతో, ఆర్టిజీస్, ఐటిఇ అండ్‌సి కార్యదర్శి కాటంనేని భాస్కర్ సోమవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ జిల్లాలో ఐటి పార్కుల ఏర్పాటుకు ఉన్న అవకాశాలు, భూముల లభ్యతపై చర్చించారు. అనకాపల్లి నుంచి భోగాపురం విమానాశ్రయం వరకు, విమానాశ్రయం దాటిన తర్వాత కూడా జాతీయ రహదారికి పదిహేను కిలోమీటర్ల లోపల స్థలాలను గుర్తించాలని ఆయన సూచించారు. ఈ స్థలాల్లో మౌలిక సదుపాయాలను, రహదారులను ప్రభుత్వమే కల్పిస్తుందని తెలిపారు. ఈ ప్రాంతంలో ఐటి అభివృద్ధికి ప్రభుత్వం కృత నిశ్చయంతో ఉందని ఆయన స్పష్టం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ మాట్లాడుతూ, భోగాపురం విమానాశ్రయం వరకు జాతీయ రహదారి కిరువైపులా 200 మీటర్ల పరిధిలో ఐటి పార్కులను ఏర్పాటు చేసేందుకు ఇప్పటికే సుమారు 754 ఎకరాలను గుర్తించామన్నారు. 100 ఎకరాలు పైబడిన మూడు బ్లాకులు వీటిలో ఉన్నాయని తెలిపారు. వీటిల్లో అధిక శాతం ప్రభుత్వ భూములు, డి పట్టా భూములే అన్నారు. తాజా ఆదేశాల మేరకు 15 కిలోమీటర్ల లోపల ఉన్న ఖాళీ స్థలాలను గుర్తించి వెంటనే నివేదిక పంపిస్తామని తెలిపారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బేబినాయన

పంట పొలాలకు రోడ్లు

ఎమ్మెల్యే బేబినాయన

ప్రజాశక్తి-బొబ్బిలి

రైతులు పండించే పంటలను కళ్లాలు, ఇళ్లకు తెచ్చుకునేలా పొలాలకు లింక్ రోడ్లు వేయాలని ఎమ్మెల్యే బేబినాయన.. ఎఎంసి పాలకవర్గాన్ని కోరారు. స్థానిక ఎఎంసిలో సోమవారం వ్యవసాయ మార్కెట్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల అభివృద్ధికి ఎఎంసి పని చేయాలని కోరారు. ఎఎంసి ఆదాయ మార్గాలను పెంచి రైతుల అభివృద్ధికి ఖర్చు చేయాలని ఆదేశించారు. రెండు వేల మెట్రిక్ టన్నుల సామర్థ్యం కలిగిన గోదాముల నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. తన దృష్టికి తెచ్చిన సమస్యలను పరిష్కరిస్తామని చెప్పారు. చైర్మన్ ఎన్.వెంకటనాయుడు మాట్లాడుతూ రైతు బజార్ ఏర్పాటుకు, పంట పొలాలకు లింక్ రోడ్లు వేసేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. సమావేశంలో డైరెక్టర్లు, అధికారులు పాల్గొన్నారు.

15లోగా రైతులకు సంపూర్ణంగా యూరియా సరఫరా

ఈ నెల 15లోగా రైతులకు సంపూర్ణంగా యూరియా సరఫరా చేస్తామని ఎమ్మెల్యే బేబినాయన అన్నారు. మార్కెట్ యార్డులో సోమవారం ఆయన మాట్లాడుతూ యూరియా కొరత ఉండడం వాస్తవమే అయినా, పూర్తిగా లేదని ప్రచారం చేయడం సరికాదన్నారు. తప్పుడు ప్రచారాన్ని నమ్మొద్దని రైతులను కోరారు. గోవా గవర్నర్ అశోక్‌పై మాజీమంత్రి బొత్స సత్యనారాయణ అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. ఆర్థిక సంక్షోభంలో ఉన్న రాష్ట్రంలో మౌలిక సౌకర్యాలను పూర్తిగా పట్టించుకోకుండా రూ.500 కోట్లు ప్రభుత్వ ధనాన్ని రుషికొండ ప్యాలెస్‌కు ఎవరైనా ఖర్చు చేస్తారా? అని ప్రశ్నించారు.


మాట్లాడుతున్న డిఎస్‌పి భవ్యరెడ్డి

నేరచరిత్ర కలిగిన వారిపై నిఘా

బొబ్బిలి డిఎస్‌పి భవ్యరెడ్డి

ప్రజాశక్తి-మెంటాడ

ప్రతి గ్రామంలోనూ నేరచరిత్ర కలిగిన వారిపై నిఘా ఉంచాలని బొబ్బిలి డిఎస్‌పి భవ్యరెడ్డి పోలీసులను ఆదేశించారు. సోమవారం మండలంలోని ఆంధ్ర పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేశారు. ఆంధ్ర పోలీస్ స్టేషన్ పరిధిలో వివిధ రకాల నేరాలలో పట్టుబడిన వాహనాలను పరిశీలించారు. స్టేషన్‌కు సంబంధించిన వివిధ ప్రాపర్టీలను, కేసుల నమోదు, పెండింగ్ రికార్డులను పరిశీలించారు. క్రైమ్ రేటుపై డిఎస్‌పి సమీక్ష నిర్వహించి, నేరాలను తగ్గించే దిశగా కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో సిఐ రమణ, ఎస్ఐ సీతారాం, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



విద్యార్థులతో ఎమ్మెల్యే అదితి

పుస్తకాలే సరస్వతీ నిలయాలు : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-విజయనగరంకోట

పుస్తకాలే సరస్వతి నిలయాలని విజయనగరం ఎమ్మెల్యే పూసపాటి అదితి విజయలక్ష్మి గజపతిరాజు అన్నారు. ఒక చిన్న పుస్తకం ఒక పెద్ద ఆలోచనకు దారి తీస్తుందని, ఒక అక్షరం ఒక జీవితానికి మార్గదర్శి అవుతుందని అన్నారు. ఎమ్మెల్యే అదితి విజయలక్ష్మికి వివిధ సందర్భాలలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అందజేసిన పుస్తకాలను తన తండ్రి బాటలోనే సోమవారం గాజులరేగలో గల జిల్లా పరిషత్ పాఠశాల, మండల పరిషత్ పాఠశాల (రెగ్యులర్), మండల పరిషత్ పాఠశాల (స్పెషల్)లకు చెందిన మొత్తం 598 మంది విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థుల్లో చదువుపై ఆసక్తిని పెంచడం మాత్రమే కాదు, వారి భవిష్యత్తుపై నమ్మకం కలిగించి వారి కలల్ని నెరవేర్చుకునే విధంగా ప్రోత్సహించాలనే ప్రధాన ఉద్దేశంతో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఐవిపి రాజు, పట్టణ పార్టీ అధ్యక్షులు ప్రసాదుల లక్ష్మి వరప్రసాద్, మండల పార్టీ అధ్యక్షులు బొద్దల నర్సింగరావు, కార్యదర్శి గంటా పోలి నాయుడు, జొన్నవలస, రాకోడు ఎంపిటిసిలు రాజేష్ బాబు, వేచలపు శ్రీనివాసరావు, గంటా రవి తదితరులు పాల్గొన్నారు.

అన్నిదానాల కన్నా నేత్రదానం గొప్పది

ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి

ప్రజాశక్తి-లక్కవరపుకోట

అన్నిదానాల కన్నా నేత్రదానం గొప్పదని ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి అన్నారు. సోమవారం స్థానిక కెజిబివిలో నిర్వహించిన జాతీయ నేత్రదాన పక్షోత్సవాల కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ప్రతిఒక్కరూ నేత్రదానంపై అవగాహన పెంచుకొని సామాజిక బాధ్యతగా తీసుకుని పదిమందికి చెప్పాలని కోరారు. ఈ సందర్భంగా వ్యాసరచన పోటీల్లో విజేతలకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో దాసరి కార్పొరేషన్ చైర్మన్ పొట్నూరు రత్నాజీ, గొంప దుర్గా ఉమేష్, మాజీ ఎంపిటిసి రమేష్‌నాయుడు, ఎస్ఒ బి.ప్రవీణ, తదితరులు పాల్గొన్నారు.